క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



సంస్థాన్ నారాయణపురం: మండలంలోని జనగాం గ్రామానికి చెందిన అనమోని లింగస్వామి ఇటీవల మృతి చెందాడు. శుక్రవారం జరిగిన మృతుడు లింగస్వామి కూతురు వివాహానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరై రూ. 50వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : మండలకేంద్రానికి చెందిన వేముల నరేష్ ఇటీవల మృతిచెందాడు. అతడి చిన్ననాటి మిత్రులు 2004–05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శుక్రవారం నరేష్ కుటుంబాన్ని పరామర్శించారు. రూ.లక్ష 8వేల ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కునపూరి శ్రీశైలం , బాసోజు బాలా చారి, రచ్చ ఆనంద్ , రాజు, మిర్యాల అశోక్ ,మాల్గ కృష్ణ, పాండు, లింగస్వామి, కిరణ్, ఉపేందర్, నరసింహ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



పాఠశాలలో భోజనం పరిశీలిస్తున్న రోజారాణి

భువనగిరి: అసిస్టెంట్ సివిల్ సప్లయ్ అధికారి రోజారాణి శుక్రవారం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న ఉన్నత పాఠశాల, స్థానిక బీచ్‌మహల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. రిజిస్టర్‌ను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాసుకుంట, సంజీవనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ గులాం, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



వెంకటేశ్వరరావు

భువనగిరి : భువనగిరి ఏడీఏ(సహాయ వ్యవసాయ సంచాలకులు)గా వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏడీఏగా విధులు నిర్వహించిన దేవ్‌సింగ్ మిర్యాలగూడకు బదిలీలపై వెళ్లారు. ఆలేరు ఏడీఏగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

భువనగిరి : పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జిల్లా కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ సమక్షంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా కొమ్ము జగదీష్‌బాబు,గౌరవ అధ్యక్షుడిగా దర్గాయి రమేష్, ఉపాధ్యక్షుడిగా వెల్వర్తి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అనిమళ్ల ఆంజనేయులు, అధికార ప్రతినిధిగా నర్సింగ్ రావు, కార్యదర్శిగా పరకాల నరేష్, సహాయ కార్యదర్శిగా యాట మధు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో పుశపాక ఎల్లేష్,పాశం రాజు, నర్సింహ పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ..

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నునుబోతు సైదులు ఆధ్వర్యంలో మండల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా మారాతి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శులుగా కొత్తోజు నవీన్ కుమార్, లింగాల నరసింహ, మండల కార్యదర్శులుగా దేశబోయిన నాగరాజు, నిమ్మల యాదగిరి, లింగమల్లును ఎన్నుకున్నారు. అదేవిధంగా ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా గూడ అవిలయ్య, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా ఏనుగు బీరుముల్లు, యువ మోర్చా మండల అధ్యక్షుడిగా గోలి సుమన్, యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శిగా బోయిన యాకస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ కురాకుల వెంకటేశ్వర్లు పలువురు నాయకులు తదతరులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

మోటకొండూర్ : మండలంలోని చాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం శ్రీ షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్టు హైదరాబాద్, శేషసాయి కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో సమకూర్చిన బ్యాగులు, నోట్‌పుస్తకాలు, స్టేషనరీని అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాజారవు, వీరబద్రరావు, ప్రధానోపాధ్యాయులు బాలగంగాధర్ రెడ్డి, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం క్రిష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, కృష్ణారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వీధి కుక్కలతో భయం..భయం

- తంగడపల్లిలో శునకాల స్వైరవిహారం
- బయటకు రావాలంటేనే భయపడుతున్న జనం
- కుక్కల బెడదను నివారించాలని స్థానికుల వేడుకోలు

చౌటుప్పల్ : గ్రామ సింహాలు ఇప్పుడు ఈ పేరు వింటేనే మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామ ప్రజలు జంకుతున్నారు. నాలుగు వార్డుల పరిధిలో ఉన్న తంగడపల్లిలో వీటి బెడద తీవ్రమైంది. వందల సంఖ్యలో ఉన్న శునకాలు జనానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వీధుల్లో గుంపులు గుంపులుగా స్వైరవిహారం చేస్తుండడంతో ఇళ్ల నుంచి బయటకు వెళ్లి రావాలన్నా ఆచితూచి ముందుకు అడుగేయాల్సిన పరిస్థితి.. బైక్‌పై వెళ్తున్నప్పుడు కంగారు.. పిల్లలను పనుల మీద బయటకు పంపించాలన్నా భయం.. భయం. చిన్నారులు ఇంటి ముందు సరదాగా ఆడుకోవాలన్నా ఆందోళన తప్పడం లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని, ఏ కుక్క ఎక్కడి నుంచి దాడికి తెగబడి ప్రాణాలు తీస్తుందేమోనన్న భయంతో గ్రామ ప్రజలు కాలాన్ని గడుపుతున్నారు. కుక్కల బెడద రోజురోజుకు అధికమవుతున్న ఎవరూ ఈ సమస్యను



తంగడపల్లిలో గుంపులుగా సంచరిస్తున్న వీధికుక్కలు

పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

రోడ్లపై స్వైరవిహారం..

చౌటుప్పల్–మునుగోడు ప్రధాన రహదారిపై తంగడపల్లి గ్రామంలోని ఇంద్రపాల ముత్యాలమ్మ దేవాలయం వద్ద కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. రోడ్డుపై వచ్చే కార్లు, బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనదారుల వెంట పడుతున్నాయి. గుంపులుగా వెంట పడుతున్న కుక్కల నుంచి తప్పించుకునేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు వాహనాలు అదుపుతప్పి రోడ్డుపై పడిపోయి గాయాలపాలవుతున్నారు. గ్రామాల్లోని అంతర్గత రోడ్లలోనూ ఇదే సమస్య నెలకొందని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు.



ఇంద్రపాల ముత్యాలమ్మ దేవాలయం వద్ద..

కర్రలేనిదే బయటకు రాలేని పరిస్థితులు..

వీధుల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో గ్రామ ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. వివిధ పనుల నిమిత్తం కాలినడకన బయటకు వెళితే చేతిలో కర్ర లేకుండా బయటకు వెళ్లలేకపోతున్నామని పలువురు వాపోతున్నారు. ఇప్పటికే గ్రామంలో పలువురు చిన్నారుల తో పాటు పెద్దవారు కుక్క కాటుకు గురయ్యారు. అయినా వీధి కుక్కల నియంత్రణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు కరువయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన ఆయా శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇబ్బందులు పడుతున్నాం



గ్రామంలో కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. వాహనదారుల వెంట పడుతుండడంతో అదుపుతప్పి కింద పడి గాయాలపాలవుతున్నారు. గ్రామస్తులు ఒంటరిగా బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మున్సిపాలిటీ అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నాం.

– ముటుకుల్లోజు రాఘవాచారి, తంగడపల్లి

కుక్కల బెడదను నివారిస్తాం



మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల సమస్య తీవ్రంగానే ఉన్నట్టు ఇప్పటికే గుర్తించాం. సమస్య పరిష్కారం కోసం ప్లాన్ చేశాం. స్వతంత్ర ఏజెన్సీస్ అనే సంస్థతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నాం. వీలైనంత త్వరలో సంస్థ ఆధ్వర్యంలో పని ప్రారంభమవుతుంది. కుక్కలకు కుటుంబ నియంత్రణ చర్యలతోపాటు కరిచిన వారికి ఎలాంటి ప్రాణాపాయం లేకుండా కుక్కలకు ఇంజెక్షన్ చేయిస్తాం.

– వెంకటేశ్వరనాయక్, మున్సిపల్ కమిషనర్, చౌటుప్పల్

యాదాద్రి దేవస్థానంలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

యాదగిరిగుట్ట: యాదాద్రి దేవస్థానంలో కల్పించే ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన సమరభేరి సైకిల్ యాత్రలో భాగంగా శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యాదగిరిగుట్టలో ఉన్న సంక్షేమ హాస్టళ్ల పూర్తిగా శిథిలావస్థకు చేరాయని తెలిపారు. సంక్షేమ హాస్టల్స్‌లో రెగ్యులర్‌గా కాస్మోటిక్ చార్జీలు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్య పూర్తిగా సంక్షేమంలో ఉందని ఆవేదన వ్యక్తం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చేశారు. ఖాళీగా ఉన్నటువంటి వార్డెన్ పోస్టులను వెంటనే భర్తీ చేసి, హాస్టళ్లలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శివాని, రాహుల్, శ్రీనివాస్, జగన్, నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరిలో మాతం ప్రదర్శన



మాతం ప్రదర్శనలో పాల్గొన్న షియా ముస్లింలు

భువనగిరి : మహమ్మద్ ప్రవక్త మనువడు ఇమామ్ హుస్సేన్, ఆయన అనుచరుల బలిదానాన్ని స్మరిస్తూ అర్బయాన్ పురస్కరించుకుని భువనగిరి షియా ముస్లిం సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మాతం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కత్తులతో ఎదను బాదుకుంటూ విషాద గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా షియా మౌల్వి షంస్ అబ్బాస్ నక్వీ ధార్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో షియా సంఘం అధ్యక్షుడు సయ్యద్ రజా హుసేన్,హైదర్ అలీ, తఖి హుసేన్, సజ్జాద్, అస్గర్, బాసిత్ అలీ, మహేదీ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

భూదాన్‌పోచంపల్లి : మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని భీమనపల్లి గ్రామంలో డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్ వినోద్‌కుమార్, శేఖర్, యాదగిరి, గోవర్ధన్, ఆదిమూలం శ్రీను, కల్యూరి పాండు, వెంకటేశ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

భువనగిరి రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వడాయిగూడెంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లలో నిల్వ ఉన్న ఉన్న నీటిని తొలగించారు. కార్యక్రమంలో ఎంపీఓ దినాకర్, పంచాయతీ కార్యదర్శి ఆమని, ఆశ నాగలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రాజకీయ డ్రామాలు



వైకుంఠద్వారం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

యాదగిరిగుట్ట: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, మండల అధ్యక్షుడు గుంటిపల్లి సత్యం విమర్శించారు. గురువారం యాదాద్రి కొండపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు చేపట్టిన రాజకీయ కార్యక్రమాలను నిరసిస్తూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో వైకుంఠద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండపైన రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. భక్తులు ఎంతో పవిత్రంగా కొలిచే యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు కొలువై ఉన్న కొండపైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు రాజకీయ డ్రామాలకు తెర తీశారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రమాణాలు, పూజలు చేస్తే.. కాంగ్రెస్ నాయకులు వెళ్లి శుద్ధి చేయడం భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీయడమేనన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు కొండపైన రాజకీయ కార్యక్రమాలు చేస్తుంటే ఆలయాధికారులు ఏమీ చేస్తున్నారని ప్రశ్నించారు. కొండపైన శ్రీస్వామి వారి పవిత్రతను దెబ్బతీసే విధంగా ఇలాంటి కార్యక్రమాలు పునరావృతం కాకుండా అధికారులు చూసుకోవాలన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు తమ రాజకీయాలకు శ్రీస్వామి వారి క్షేత్రాన్ని కేంద్రంగా వాడుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఆకుల చంద్రమౌళి , గజం సంతోష్ , బీజేవైఎం అధ్యక్షులు బోడా బుచ్చి బాబు, ఓబీసీ మోర్చా అధ్యక్షులు మందోజు నరేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు బూడిద నవీన్, సీనియర్ నాయకులు భువనగిరి శ్యామ్, రంగా సత్యం, దొమ్మట నరేష్, కర్రె లక్ష్మయ్య , వాల్మీకి అజయ్, పలుగుల సురేష్, ఆకుల దేవేందర్, శివరాత్రి శ్రీశైలం, వంశీ, కంసాని చిన్న, వంగ శ్రీకాంత్, సంద ప్రవీణ్, శరత్‌రెడ్డి తదితరులున్నారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై చర్యలు తీసుకోవాలి



డీసీపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరి క్రైం: మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు గురువారం లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకోవడంతో వారు నడిచిన ప్రాంతాన్ని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వాటర్ ట్యాంకర్లతో యాదాద్రి కొండపై శుద్ధి చేయించారు. దీనిని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు గొంగిడి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం డీసీపీ రాజేష్ చంద్రకు ఫిర్యాదు చేశారు. సూర్య, చంద్ర గ్రహణాలు వచ్చినప్పుడు ఆలయ శుద్ధి నిర్వహిస్తారని, కానీ రాజకీయ నాయకులు శుద్ధి చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. వారిపై కేసు నమోదు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య, బీఆర్‌ఎస్ పట్టణ సెక్రెటరీ పాపట్ల నరహరి, ఆలేరు వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి ఉన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవం



గ్రీన్‌గ్రోవ్ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని ట్రినిటీ, గ్రీన్‌గ్రోవ్ పాఠశాలల్లో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విక్రం ల్యాండర్ నమూనాలను ప్రదర్శించారు. అంతరిక్ష ప్రయోగం గొప్పదనాన్ని, విశిష్టతను వివరించారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల చైర్మన్లు కేవీబీ.కృష్ణారావు, బండి వీణఅనిల్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్లు డాక్టర్ ఉజ్జిని మంజుల, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

కాలుష్యకారక కంపెనీలపై చర్య తీసుకోవాలి

బొమ్మలరామారం: కాలుష్యకారక కంపెనీలపై చర్య తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి పాండు అన్నారు. బొమ్మలరామారం మండలంలోని రామలింగంపల్లి గ్రామ శివారులో గల ఆఫ్టామస్ ఫ్యాక్టరీ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కెమికల్ ఫ్యాక్టరీలతో రంగాపూర్ చెరువు, రామలింగంపల్లి రామయ్య చెరువుల్లోని నీటితో పాటు, భూ గర్భ జలాలు విషతుల్యంగా మారాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, దేశెట్టి లక్ష్మీనారాయణ, ప్యారారం నర్సింహ, ముక్కెర్ల పున్నమ్మ, మేకల మంగ, పండుగ భారతమ్మ, బోదాసు నర్సమ్మ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

రాజాపేట : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ఆరుట్ల రామచంద్రారెడ్డి జయంతి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో ఆవిష్కరించా రు. ఈ కార్యక్రమంలో చిగుళ్ల లింగం, కర్ణాకర్, సిద్దులు, రాములు, గొడుగు నర్సింహ, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ వేయలేదు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయానికి అధికారికంగా ధర్మకర్తల కమిటీ వేయలేదని దేవాదాయ ధర్మాదాయ శాఖ మండల ఇన్‌చార్జ్ అధికారి చిట్టెడి వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో శ్రీరామనవమి పర్వదిన వేడుకలను నిర్వహించేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఐదుగురు వ్యక్తులతో ఉత్సవ కమిటీని వేసిందని గుర్తు చేశారు. ఉత్సవాలు ముగియడంతో ఆ కమిటీ కాల పరిమితి అప్పుడే ముగిసిందన్నారు.

సీసీఐడీ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడిగా అజిత్‌కుమార్



మోత్కూరు : కంట్రోల్ క్రైమ్ అండ్ ఇన్ఫర్మేషన్ డిటెక్టివ్ ట్రస్ట్ (సీసీఐడీ) రాష్ట్ర అధ్యక్షుడిగా మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన గట్టు అజిత్‌కుమార్ నియామకమయ్యారు. ట్రస్ట్ డైరెక్టర్ అజయ్‌కుమార్ నియామక ఉత్తర్వు లు జారీ చేసినట్టు శుక్రవారం స్థానిక విలేకరులకు ఆయన తెలిపారు.

కంపుకొడుతున్న పట్టించుకోరా..?



సీసీ రోడ్డుపై పారుతున్న మురుగునీరు

భువనగిరి : పట్టణంలోని భువనగిరి క్లబ్– భువనగిరి కోర్టు ప్రహరీ మధ్య ఉన్న సీసీరోడ్డుపై డ్రెయినేజీ నీరు పారి కంపుకొడుతోంది. ఈ రోడ్డు మార్గంలో పహడీనగర్, తాతానగర్, బంజారాహిల్స్ కాలనీల వాసులు రాకపోకలు సాగిస్తుంటారు. సీసీరోడ్డు మధ్యలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ మ్యానవల్ వద్ద మురుగు నీరు పొంగి పొర్లుతోంది. దీంతో సీసీ రోడ్డుపై మురుగునీరు పారి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డుపై మురుగు నీరు పారకుండా చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ పాలనలో మహిళలకు భద్రత కరువు

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు భద్రత కరువైందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైనా కొండారెడ్డిపల్లిలో రైతు రుణమాఫీకి సంబంధించిన అంశాలను రైతులను అడిగేందుకు వెళ్లిన ఓ మహిళా జర్నలిస్టుపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడం బాధకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామంలోనే మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. మహిళ మంత్రులు బాధ్యత మరిచి ఉన్నారన్నారు. మహిళలపై దాడులు, అత్యా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

చారాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో అసలు మహిళా కమిషన్ ఉందా లేదా అనే అనుమానాలు వస్తున్నాయన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేసిందన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ కర్రె కమలమ్మ, మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్లెం స్వాతి తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల మధ్య బీటీరోడ్డు నిర్మించాలి

రామన్నపేట : మండలంలోని మునిపంపుల–లక్ష్మాపురం గ్రామాల మధ్య బీటీరోడ్డును నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. రెండు గ్రామాల మధ్య బీటీరోడ్డు నిర్మించాలని కోరుతూ సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మునిపంపుల గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రెండు గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా తయారవడంతో రైతులు, గీత కార్మికులు, గొర్ల కాపరులు, మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బోటిమీదిగూడెం ఆవాస గ్రామంకు చెందిన ప్రజలు, విద్యార్థులు నిత్యం బురదమడుగులలో నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తుందన్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు, పాఠశాలల బస్సులు బోటిమీదిగూడెం వరకు వచ్చే పరిస్థితిలేదన్నారు. అధికారులు,



దీక్షలో పాల్గొని మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

పాలకులు స్పందించి బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, కల్లూరి నాగేష్, జంపాల అండాలు, తొల్పునూరి శ్రీనివాస్, తాళ్లపల్లి జితేందర్, నోముల రమేష్, చంద్రశేఖర్, గంటిపాక శివకుమార్, బూడిద భిక్షం, జంపాల ఉమాపతి, మేడి భాషయ్య, అప్పం సురేందర్, యాదగిరి, తుర్కపల్లి నరేష్, ఆకుల శేఖర్ పాల్గొన్నారు.

రోడ్డుపై దిగబడిన డీసీఎం.. స్తంభించిన ట్రాఫిక్

రామన్నపేట : మండలంలోని ఇంద్రపాలనగరం –కమ్మగూడెం గ్రామాల మధ్య రోడ్డుపై డీసీఎం వాహనం దిగబడిన సంఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. వివరాల ప్రకారం చిట్యాల–భువనగిరి ఆర్ అండ్ బీ రోడ్డు వెంట వంతెనల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాహనాల రాకపోకల కోసం తాత్కాలికంగా మట్టి రోడ్డును నిర్మించారు. వర్షానికి మట్టి కుంగిపోవడంతో గురువారం రాత్రి రెండు గంటల సమయంలో డీసీఎం వ్యాన్ దిగబడింది. దీంతో ఇరుపక్కల రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. రామన్నపేట ఎస్ఐ పి.మల్లయ్య సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీతో డీసీఎంను బయటకు తీయించారు. రోడ్డును సరిచేయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. తెల్లవారుజామున నాలుగు గంటల వరకు ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

చౌటుప్పల్ : విద్యార్థులు చిన్నతనం నుంచే సేవా గుణాన్ని అలవర్చుకోవాలని సీఐ అశోక్‌రెడ్డి అన్నారు. కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం చందన స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు సేకరించిన రూ. 17వేల రూపాయలను శుక్రవారం ఆన్‌లైన్‌లో కేరళ సీఎం సహాయనిధికి పంపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అవ్వారు రామేశ్వరి, డైరెక్టర్ అవ్వారు గోవర్ధన్, ఉపాధ్యాయులు స్వప్న, పద్మ, గీత, రేణుక, జగదీశ్వరి, అర్చన, కవిత, శ్రీలత, రమ, దీప, లావణ్య పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని ధర్నా

ఆత్మకూరు(ఎం): అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంకు ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల సమస్యలపై ఈ నెల 27న జిల్లా కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ షఫీయోద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, సీఐటీయూ మండల నాయకులు రచ్చ గోవర్ధన్, రాచమల్ల సత్తయ్య, తుమ్మల సత్యనారాయణరెడ్డి, పల్లెర్ల బుచ్చయ్య, మల్లారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

మోత్కూరు : వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో గ్రామీణ శ్రామికుల సర్వేను నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు రాచకొండ కనకయ్య, కురుమేటి యాదయ్య, కురుమేటి సోమయ్య, దొండ యాదయ్య, మల్లయ్య, రామచంద్రం, సోమయ్య, లక్ష్మమ్మ, లక్ష్మారెడ్డి, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

రైతులకు పాస్‌పుస్తకాలు ఇవ్వాలి

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని రాచకొండ ప్రాంతంలో సాగు చేసుకుంటున్న భూములకు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పాస్‌పుస్తకాలు ఇవ్వకపోతే భూ సాగుదారులను సమీకరించి పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు చింతకాయల నర్సింహ, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంగదేవి సైదులు, సీఐటీయూ జిల్లా కోశాధికారి దోనూరి నర్సిరెడ్డి, గుంటోజు శ్రీనివాస్‌చారి, పిట్ట రాములు, జనిగల నర్సింహ, గాజుల అంజయ్య, సిలువేరు గాలయ్య, బొడ్డుపల్లి లాలయ్య, ఉడత గాలయ్య, కుక్కల అంజయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు

ఆలేరురూరల్ : ఓటర్ల జాబితా తయారీలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆలేరు తహసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ సమ్మరి రివిజన్ – 2025లో భాగంగా బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పులు లేని ఓటర్ల జాబితా జాబితా తయారీలో బీఎల్ఓల పాత్ర కీలకమైనదన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ అక్టోబర్ ఒకటవ తేదీ లోపు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శిక్షణ అధికారులు దూడల వెంకటేష్, బద్దం సంజీవరెడ్డి, ఎం.తిరుపతిరెడ్డి, అశోక్, ఆర్ఐ పూర్ణచందర్, రాంప్రసాద్, స్వామి, శ్రీకాంత్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో ఫోటో ఎలక్టోరల్ రోల్స్–25పై సూపర్‌వైజర్లకు, బీఎల్ఓలకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఫోటోఎలక్టోరల్‌రోల్–25పై ఇంటింటి సర్వే చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ షఫీయోద్దీన్, ఆర్ఐ మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మంచినీటి క్యాన్ల పంపిణీ

వలిగొండ : మండలంలోని మొగిలిపాక గ్రామంలో శుక్రవారం మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి ఆయన తండ్రి శైలేష్ రెడ్డి జ్ఞాపకార్థం మంచినీటి క్యాన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, శంకరయ్య, నరసింహ, మొగిలిపాక రమేష్ ,విష్ణు చారి, సత్యారాములు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

సంస్థాన్ నారాయణపురం: పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్ఐ జగన్ అన్నారు. మండలంలోని జనగాంలోని జెడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పాఠశాల హెచ్‌ఎం ఉదయ్‌తో కలిసి ప్రారంభించారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

ఆత్మకూరు(ఎం): పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని ప్రధానోపాధ్యాయుడు డి.వెంకన్న అన్నారు. మండలంలోని కొరటికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన పెద్ది సత్తయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు భిక్షం రూ. 16వేలతో నిర్మించిన రేకుల షెడ్డును శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ సత్యలక్ష్మి, ఉపాధ్యాయులు స్వామి, రవి, వరప్రసాద్, శ్రీనువాసచారి, అనురాధ, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రాచకొండ బాలరాజుకు పరామర్శ

మోత్కూరు : తిరుమలగిరి మండల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన మోత్కూరు మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు గౌడ్‌ను శుక్రవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు జి.లక్ష్మీనర్సింహ రెడ్డి, చిరుమర్తి యాదయ్య, గుండగోని రామచంద్రు గౌడ్, బండ విజయ్‌రెడ్డి, రాములు, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల భగవంత్, మొగులయ్య, మెంట నగేష్, యాదయ్య పాల్గొన్నారు.

సమయపాలన పాటించని అధికారులపై చర్య తీసుకోవాలి

గుండాల: సమయపాలన పాటించని అధికారులపై చర్య తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక ఎదుట రైతులతో కలిసి నిరసన తెలిపారు. రైతు వేదికల్లో వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో రుణమాఫీకి సంబంధించిన వివరాలను ఎవరిని అడగాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దు

మోత్కూరు : రుణమాఫీ కానిరైతులు ఆందోళన చెందొద్దని మోత్కూరు సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రైతుకు రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం చర్య తీసుకుంటుందన్నారు.